ప్రజారోగ్యానికి ప్రభుత్వం ప్రాధాన్యత

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి



ములకలచెరువు: వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి



కలికిరి: మాట్లాడుతున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

ములకలచెరువు: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజారోగ్యానికి ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దపాళ్యంలో జరిగిన ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏర్పాటు చేసిన వివిధ స్టాల్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రజా ఆరోగ్యమే జగన్ లక్ష్యంగా... అందరూ ఆరోగ్యంగా ఉండాలనే ఉద్దేశంతో జగనన్న సురక్ష కార్యక్రమం అమలు చేసినట్లు చెప్పారు. పైసా ఖర్చు లేకుండా స్పెషలిస్టులైన వైద్యుల చేత వైద్య సేవలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమం ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ సాయిలీలా, డాక్టర్ జాహ్నవి, నాయకులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికే జగనన్న ఆరోగ్య సురక్ష

కలికిరి: పేదల ఆరోగ్యానికే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష తీసుకువచ్చారని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని పత్తేగడ గ్రామ సచివాలయంలో శుక్రవాం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలు అనారోగ్యంతో ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో వైద్య సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి వెళ్లి ప్రతి ఒక్కరికి వైద్య పరీక్షలు నిర్వహించారన్నారు. వైద్య సదుపాయం అవసరమైన వారికి టోకెన్లు అందచేసి ఆరోగ్య సురక్ష క్యాంపులకు తరలించి, స్పెషలిస్టు వైద్యులచే ఏడు రకాల నిర్ధారణ పరీక్షలు నిర్వహించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీకి రెఫర్ చేయడం జరుగుతుందన్నారు. ఎలాంటి ఖర్చు లేకుండా కార్పొరేట్ వైద్యం పేదలకు అందుతోందని గుర్తుచేశారు. అది కూడా ఇంటి వద్దకే వచ్చి రోగులను గుర్తించడం, వైద్యం పూర్తయిన అనంతరం పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఇంటి వద్దకే వచ్చి పర్యవేక్షిస్తారన్నారు. అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జీవీ శ్రీనాథరెడ్డి, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మెన్ నల్లారి తిమ్మారెడ్డి, డీపీఎంఒ డాక్టర్ లోకవర్ధన్, ఎంపీపీ నూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, వైద్యాధికారులు చిన్నరెడ్డెప్ప, కావ్యగంధ, హిమబిందు, ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు కార్పొరేట్ వైద్యం

వాల్మీకిపురం: ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తోందని ఆర్‌బీకే చైర్మెన్ నీళ్లభాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని మంచూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 280 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు, మాత్రలు పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలను అందజేయడంతో పాటు వైద్యానికి పెద్ద పీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఫిరోజ్‌ఖాన్, నాయకులు ఆనంద, శంకర్ రెడ్డి, విశ్వనాథ్, నాగరాజ, చిన్నా, తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత

కేవీపల్లె : ప్రజారోగ్యానికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని మహల్‌రాజుపల్లె, తిమ్మాపురంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీడీవో మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని గ్రామీణ ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ పాత్తపు సతీష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ హరిబాబు, సర్పంచ్‌లు నీలావతి, లక్ష్మీదేవి, ఈవోపీఆర్‌డీ గఫార్, నాయకులు ప్రదీప్‌రెడ్డి, లక్షుమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటే వైద్య సేవలు

కలకడ : పేదలందరికీ జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంతో ఇంటి ముంగిటే ఉత్తమ వైద్యసేవలు అందుతున్నాయని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. శుక్రవారం మండలంలోని దేవులపల్లె సచివాలయం పరిధిలోని దేవులపల్లె గ్రామంలో ఏర్పాటు జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమంలో ఎంపీపీ వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పరమేశ్వర్‌రెడ్డి, సర్పంచ్ వెంకట్రమణ వైఎస్సార్‌సీపీ నాయకులు అంజన్‌కుమార్, రెడ్డెప్పనాయుడు, గోవర్ధన్, నరసింహులు, సుందరబాబు తదితరులు పాల్గొన్నారు.

తంబళ్లపల్లెలో..

తంబళ్లపల్లె: నిరుపేద ప్రజల ఆరోగ్యానికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలిచి వైద్యసేవలు అందిస్తోందని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి అన్నారు. మండలంలో 12 రోజులుగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపులు శుక్రవారంతో ముగిశాయి. తంబళ్లపల్లె ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. డాక్టర్లు అందిస్తున్న వైద్యసేవలు, ఉచిత మందులపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మెడికల్ ఆఫీసర్ అనుపమ, డాక్టర్లు మునికుమార్, నజ్మా, ఎంపీడీవో సురేంద్రనాథ్, ఎంఈవోలు త్యాగరాజు, నాగసుబ్బరాయుడులను ఎమ్మెల్యే శాలువలతో సత్కరించి అభినందించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు. గర్భిణులకు సీమంతం కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించారు. అంగన్‌వాడీ కార్యకర్తల పనితీరును ప్రశంసించారు. కార్యక్రమంలో సర్పంచ్ నీలూఫర్, వైస్ ఎంపీపీ కరీమ్, ఎంపీటీసీ సభ్యురాలు సరోజమ్మ, కో–ఆప్షన్ సభ్యులు జమాల్‌బాషా, సింగిల్‌విండో చైర్మన్ భార్గవ్‌రెడ్డి, మండల అభివృద్ధికమిటీ చైర్మన్ నారాయణరెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితులు చినరెడ్డి, నాయకులు రామూర్తి, షాదిక్, మైనుద్దీన్, కొండప్ప తదితరులు పాల్గొన్నారు.

474 మందికి వైద్య సేవలు

పీలేరు రూరల్ : జనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 474 మందికి వైద్య సేవలు అందించినట్లు తహసీల్దార్ ధనుంజయులు తెలిపారు. శుక్రవారం మండలంలోని ముడుపులవేముల పంచాయతీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. బీపీ, షుగర్, కంటి పరీక్షలు, డెంగీ, మలేరియా పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా అందజేశారు. ఆరుగురిని ఆర్యోగ్యశ్రీ ఆపరేషన్లకు, 22 మందిని కంటి ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు రాకేష్, లోకనాథరెడ్డి, ఎంపీటీసీ చెంగల్‌రాయుడు, నాయకులు రామిరెడ్డి, గంగిరెడ్డి, అశోక్, గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ కార్తీక్, డాక్టర్ ప్రసన్న లక్ష్మీ, డాక్టర్ తరుణ తదితరులు పాల్గొన్నారు.



కేవీపల్లె :జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మందులు పంపిణీ

ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శం

పెద్దతిప్పసముద్రం: జగనన్న ఆరోగ్య సురక్ష దేశానికే ఆదర్శమని ప్రజా ప్రతినిధులు అన్నారు. మండలంలోని పట్టింవాండ్లపల్లిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎంపీడీఓ గిరిధర్‌రెడ్డి, తహసీల్దార్ విద్యాసాగర్, డాక్టర్‌లు యస్దానీ, అభిలాష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రజలు అధిక సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకున్నారు. కార్యక్రమంలో నాయకులు మహమూద్, పట్టిరిక శోభా, శంకర్, శివన్న, డ్రిప్ రమణ, గణపతిరెడ్డి, కుమార్‌రెడ్డి, లక్ష్మీదేవి, సుబ్బరాం, చెట్ల వెంకటరెడ్డి, లక్ష్మీపతి, గొర్ల శీనా, పాలశీనా పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన

రామసముద్రం: రామసముద్రం మండలం కాప్పల్లె పంచాయతీలో సర్పంచ్ నారాయణమ్మ , ఎంపీటీసీ విశ్వనాథరెడ్డిల అధ్యక్షతన శుక్రవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ కుసుమకుమారి, సింగిల్‌విండో అధ్యక్షుడు కేశవరెడ్డి, వైస్‌ఎంపీపీ రమణారెడ్డి, గంగాధర్‌నాయుడు, మండల కన్వీనర్ నంద, ఆర్‌బికె చైర్మన్ కృష్ణమూర్తి హాజరైయ్యారు. ఎంపీపీ మాట్లాడుతూ విద్యా, వైద్యానికి జగనన్న ప్రభుత్వంలో అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని పేదలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు లీలా, భార్గవి, నూరుల్లా, డీటీ శ్రీనివాసరావు,ఈవోపీఆర్‌డి సుధాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి షభాన, నాయకులు గెవన్న, ఆదినారాయణ, కృష్ణప్ప, సచివాలయ కన్వీనర్ మంగరాజు, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.






కలకడ: వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎంపీపీ శ్రీదేవి, తంబళ్లపల్లెలో వైద్యం కోసం తరలివచ్చిన ప్రజలు, పీలేరు: ముడుపులవేములలో..., పెద్దతిప్పసముద్రం: కంటి వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

క్లుప్తంగా

16న వాహనాల వేలం

బి.కొత్తకోట: ఈనెల 16న బి.కొత్తకోట పోలీసులకు అక్రమ మద్యం కేసుల్లో పట్టుబడిన రెండు కార్లు, బైక్‌లను వేలం ద్వారా విక్రయించనున్నట్లు ఎస్ఐ రామమోహన్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలంలో పాల్గొనాలని కోరారు.

కర్ణాటక మద్యం విక్రేతల అరెస్ట్

బి.కొత్తకోట : కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకువచ్చి బి.కొత్తకోటలో అద్దె ఇంటిలో గుట్టుచప్పుడు కాకుండా విక్రయిస్తున్న ముగ్గురిని అరెస్ట్‌చేసి 168 ఓటీ విస్కీ(180ఎం.ఎల్.) టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీహరిరెడ్డి తెలిపారు. బి.కొత్తకోట వావిలాలవంకలో నిందితులు ఆర్.భాస్కర్ (48), ఆర్.పవన్(24), డి.శోభ(28) నివాసం ఉంటున్నారు. వీరిలో ఆర్.భాస్కర్ తమ్ముడి కుమారుడైన పవన్ కర్ణాటక నుంచి అక్రమంగా మద్యాన్ని తీసుకువచ్చి చిన్నానకు ఇచ్చేవాడు. దానిని ఆయన, కూతురైన శోభ బి.కొత్తకోటలో మద్యం ప్రియులకు విక్రయించేవారు. ఈ విషయమై సమాచారం అందుకున్న ఎస్ఈబీ సిబ్బంది శుక్రవారం ఉదయం 6 గంటల సమయంలో ఇంటిపై దాడిచేసి మద్యం స్వాధీనం చేసుకుని నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. దాడుల్లో ఎస్ఐ రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వమిత్వ సర్వే



స్వమిత్ర సర్వే కార్యక్రమంలో అధికారులు

కేవీపల్లె : మండలంలోని మఠంపల్లె పంచాయతీలో స్వమిత్వ సర్వే (గ్రామాల సర్వే, గ్రామీణ ప్రాంతాలలో మెరుగైన సాంకేతికతతో మ్యాపింగ్) కార్యక్రమం శుక్రవారం చురుగ్గా చేపట్టారు. ఈ సందర్భంగా ఈవోపీఆర్‌డీ ఎస్.ఎ. గఫూర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నివాస ఆస్తులను గుర్తించడానికి సమగ్ర సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి యోగా పోటీలు

పీలేరు : స్థానిక షీ దివ్య యోగా విద్యాలయంలో ఆదివారం జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహిస్తున్నట్లు యోగా స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ పి.వి.ఎస్. లక్ష్మీ తెలిపారు. చిత్తూరు, కడప, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి జిల్లా స్థాయి యోగాసన పోటీలు ఆదివారం ఉదయం 9 గంటల నుంచి నాలుగు విభాగాల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు బహుమతులు తోపాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. వివరాలకు 9948244442 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఓపెన్ స్కూల్ అడ్మిషన్ల దరఖాస్తు గడువు పెంపు

మదనపల్లె సిటీ: సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంచారు. అపరాధ రుసుం లేకుండా ఈనెల 16 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని స్థానిక ఓపెన్ స్కూల్ కోర్డినేటర్ సుబ్బారెడ్డి, అసిస్టెంట్ కో ఆర్డినేటర్ మహమ్మద్‌ఖాన్ తెలిపారు. రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. పదో తరగతి చేరేందుకు 14 ఏళ్లు నిండినవారు, ఇంటర్‌లో చేరేందుకు పదో తరగతి పూర్తయి 15 ఏళ్లు నిండినవారు అర్హులని తెలిపారు. అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 8121852786ను సంప్రదించాలని కోరారు.

ఘనంగా మేరా మిట్టి మేరా దేశ్

మదనపల్లె సిటీ: మేరా మిట్టి మేరా దేశ్ కలశ యాత్ర శుక్రవారం స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. కాలేజీ ప్రిన్సిపాల్ బాలకృష్ణమూర్తి మాట్లాడుతూ నేటి యువత జాతీయభావం కలిగి దేశం పట్ల భక్తిభావాలు కలిగి వుండాలన్నారు. జన్మనిచ్చిన దేశం కోసం కృతజ్ఞత భావం కలిగి ఉండాలన్నారు. ఎన్ఎస్ఎస్ పీఓ సేగు రెడ్డప్పరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకురాలు శివపార్వతి, శ్రీదేవి, మాలతి, రమణ,గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు

మదనపల్లె సిటీ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 28 నుంచి 30 వరకు పశ్చిమ గోదావరి జిల్లా భీమరంలో జరిగే రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు 6వ తరగతికి చెందిన విద్యార్థులు ఆఫ్రిన్, చరణ్‌తేజలు ఎంపికైనట్లు హెచ్‌ఎం సుబ్బారెడ్డి, పీడీలు దేవకి, జలజ తెలిపారు. ఈనెల 12న తిరుపతి జిల్లా శ్రీకాళహస్తిలో జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీల్లో ఈ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పేర్కొన్నారు. శుక్రవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్‌ఎం సుబ్బారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహుడి పవిత్రోత్సవాలు

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి వారి పవిత్ర ఉత్సవాలు శనివారం నుంచి మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయప్రధాన అర్చకులు గోపాలబట్టర్ తెలిపారు. అర్చన దోషములను నివారించట, సర్వాభీష్టములను అందించుట, యజ్ఞఫలములను ప్రసాదించుట, మన ఆత్మ, శరీరం, ఇంద్రీయాలు, వాక్కు కర్మలను పవిత్రంగా చేయడం కోసం పవిత్ర ఉత్సవాలు నిర్వహిస్తారు. ప్రతి ఏటా ఈ మాసంలో స్వామివారి పవిత్ర ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా శుక్రవారం స్వామివారి ఆలయంలో పవిత్ర ఉత్సవాల నిర్వహణ కోస అర్చకులు అంకురార్పణ చేశారు. శనివారం పవిత్ర ప్రతిష్ఠ, స్నపన తిరుమంజనం, యాగశాల కైంకర్యాలు నిర్వహించనున్నారు. ఆదివారం పవిత్ర సమర్పణ, యాగశాలకై ంకర్యాలు, సోమవారం మహాపూర్ణాహుతి, పవిత్ర విసర్జన, పవిత్ర వితరణ, తిరువీధి ఉత్సవాలు నిర్వహించనున్నారు. పవిత్రసేవలో పాల్గొనదలిచిన దంపతులు రూ.300 చెల్లిస్తే ఒక పవిత్ర మాల, స్వామివారి ఉత్తరీయం, అన్నప్రసాదాలు పంపిణీ చేయనున్నట్లు వారు పేర్కొన్నారు.



ఉత్సవాల అంకురార్పణ సందర్భంగా ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు


ప్రజా ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి

– పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి: ప్రజా ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి కోరారు. నియోజకవర్గంలోని కలికిరి మేజర్ గ్రామ పంచాయతీ కలికిరి–2 సచివాలయం పరిధిలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పట్టణ పరిధిలోని బీడీ కాలని, మంగమ్మనగర్, క్రాస్ రోడ్డు, మల్‌రెడ్డినగర్ ప్రాంతాల్లో ఎమ్మెల్యే చింతల ఇంటింటికి వెళ్లి గత నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి అందన లబ్ధిని వివరించి, బ్రోచర్‌లను అందజేశారు. అనంతరం ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఎన్నికలలో ఇచ్చిన హామీలలో 99 శాతం హామాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి అమలు చేశారన్నారు. దళారీ వ్యవస్థకు తావులేకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి సంక్షేమ లబ్ధి అందుతోందన్నారు. వలంటీరు, గ్రామ సచివాలయ వ్యవస్థతో నేరుగా ఇంటికే సంక్షేమ చేరుతోందన్నారు. ప్రస్తుతం అమలవుతున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వచ్చే ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, ఎంపీపీ సూర్జహాన్, జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మెన్ శ్రీకర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రెడ్డెప్ప, ఎస్సీసెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్టీడి హరి, ఎంఐ హనీఫ్, మధుసూదన్‌రెడ్డి, విద్యార్థి సంఘం నరేష్, మల్లికార్జున, మహేంద్రరెడ్డి పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

వాల్మీకిపురం: ఈ నెల 21న స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఇన్‌ఛార్జ్ జడ్జి గాయత్రి తెలిపారు. శుక్రవారం స్థానిక కోర్టులో పోలీసులు, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారించి, కక్షిదారుల్లో అవగాహనలు కల్పించి కేసులు రాజీ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పోలీసులు, రెవెన్యు అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి గాయత్రి

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి

పీలేరు రూరల్ : రోజు రోజుకు రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించి వాహనాలు నడపాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీసులు హెల్మెట్ వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోలీస్, పాత్రికేయులు, ప్రజలు, ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ హెల్మెట్ ధరించి ప్రమాద రహిత సమాజ నిర్మాణానికి సహకరించారు. ఎస్ఐ నరసింహులు, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది ఆదర్శవంతంగా ఉండాలి

కలికిరి: పోలీసు సిబ్బంది ప్రజలకు ఆదర్శవంతంగా ఉండాలని ఎస్ఐ కె.రహీముల్లా అన్నారు. హెల్మెట్ వినియోగం, ఉపయోగాలపై శుక్రవారం సాయంత్రం పోలీసు సిబ్బందికి అవగాహన కల్పించారు. వాహనదారులకు చెప్పే పోలీసులు ముందుగా ఆదర్శవంతంగా ఉండాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వాహనాలపై వెళ్లేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశించారు. సిబ్బందిచేత హెల్మెట్‌లు ధరింపచేశారు.



హెల్మెట్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ మోహన్‌రెడ్డి

జిల్లా స్థాయి ఆటల పోటీలకు కన్నెమడుగు విద్యార్థులు

తంబళ్లపల్లె: స్కూల్‌గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఆటల, పోటీలలో కన్నెమడుగు బాల, బాలికలు ప్రతిభ చాటి రాష్ట, జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మదన్మోహన్ ,పీడీ ఖాదర్‌బాషా తెలిపారు. శ్రీకాళహస్తి జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన జిల్లాస్థాయి యోగా పోటీలలో అండర్–14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి అనిల్‌కుమార్‌రెడ్డి ప్రతిభచాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. ఈ నెల 28, 29, 30వ తేదీలలో పశ్చిమ గోదావరి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారన్నారు. అలాగే షూటింగ్‌బాల్ పోటీలలో సబ్‌జూనియర్ విభాగంలొ సంధ్య, నాగేశ్వరి, సుబ్రమణ్యం, మిథున్‌రెడ్డిలు ప్రతిభచాటి అంతర్ జిల్లాల పోటీలకు ఎంపికయ్యారన్నారు. 18,19వ తేదీలలో కేవీపల్లె జడ్పీ హైస్కూల్‌లో జరిగే అంతర్ జిల్లా పోటీలలో పాల్గొంటారన్నారు. విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని వినతి



మంత్రితో సర్పంచ్ షేక్ జీనత్‌షఫీ

పీలేరు రూరల్ : పీలేరు మేజర్ గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇవ్వాలని రాష్ట విద్యుత్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి సర్పంచ్ షేక్ జీనత్‌షఫీ విన్నవించారు. సర్పంచ్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన జీనత్‌షఫీ శుక్రవారం తిరుపతిలో మంత్రిని కలసి సన్మానించారు. పీలేరు గ్రామ పంచాయతీకి సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలకు, వారపుసంత అభివృద్ధికి, తాగునీటికి ప్రత్యేక నిధులు ఇచ్చి గ్రామ పంచాయతీ అభివృద్ధికి తోడ్పాటునివ్వాలని కోరారు. మంత్రి సానుకూలంగా స్పందించి పీలేరు అభివృద్ధికి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు జావిద్, రుబియా, రాజలక్ష్మీ, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో అభిషేకాలు

పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో శుభ శుక్రవారం సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. శివాలయం సేవకులు సనగరం పట్టాభి రామయ్య ఆధ్వర్యంలో లక్ష్మీ అమ్మవారికి అభిషేకం , శ్రీ సూక్త హోమం, 20 రకాల పుష్పాలతో పుష్పాభిషేకం, మహా మంగళహారతి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

వెండి కిరీటం బహూకరణ

పీలేరు : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని చౌడేశ్వరి నగర్‌లో శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి దాతలు వెండికిరీటం బహూకరించారు. చౌడేశ్వరి నగర్‌కు చెందిన శ్రీరాములు, పద్మావతి దంపతులు సుమారు రూ. 1.30 లక్షల విలువైన వెండి కిరీటాన్ని చేయించారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, కిరీటంతో అలంకరించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా

బి.కొత్తకోట: వినియోగదారులకు అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించాలని డిస్కం మదనపల్లె ఈఈ యుగంధర్ కోరారు. శుక్రవారం స్థానిక విద్యుత్ కేంద్రంలో నాలుగు మండలాల ఏఈలు, ఏడీఈ, ఎల్ఐ, ఎల్ఎంలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. విద్యుత్ బిల్లుల బకాయిలు, కనెక్షన్ల పెండింగ్, విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులపై సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు కలగనివ్వకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలపై నిర్వహిస్తున్న సర్వే పక్కాగా ఉండాలని సూచించారు. విద్యుత్ సమస్యలపై సత్వరమే స్పందించాలన్నారు. ఏడీఈ రుక్మాంగదబాబు, ఏఈలు గిరిబాబు, రామ్‌లక్ష్మణ్, ఉత్తన్న, శేషకుమార్, లైన్‌మెన్లు, లైన్ ఇన్స్‌పెక్టర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిస్కం ఈఈ యుగంధర్

నియోజకవర్గంలో ఆరు కొత్త విద్యుత్ సబ్‌స్టేషన్లు

ములకలచెరువు: తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి. కొత్తకోట, పీటీఎం, ములకల చెరువు మండలాలకు ఆరు కొత్త విద్యుత్ సబ్ స్టేషన్లు మంజూరైనట్లు డిస్కం ఈఈ యుగంధర్ తెలిపారు. శుక్రవారం ఆయన ములకలచెరువు సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ బి. కొత్తకోట మండలంలోని ఇందిరా కాలనీ, మొరవపల్లి, పీటీఎం మండలంలోని టీ. సదుం, పులికల్లు, ములకలచెరువు మండలంలో సోంపల్లి, మద్దినాయినిపల్లిలో సబ్‌స్టేషన్‌లు నిర్మించనున్నట్లు తెలిపారు.

బిల్లుల వసూళ్లపై దృష్టి సారించండి

పెద్దతిప్పసముద్రం: విద్యుత్ శాఖ సిబ్బంది ప్రతి నెలా బిల్లుల వసూళ్ళపై దృష్టి సారించాలని డిస్కం డీఈ యుగంధర్ సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి సిబ్బందితో సమీక్షించారు.

రూ.10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు

పీలేరు : స్థానిక కడప రోడ్డు మార్గంలో రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి నిధులు రూ. 10 లక్షలతో సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు ఎంపీపీ సతీష్‌రెడ్డి, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం భూమి పూజ చేపట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పీలేరు పట్టణంలో అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా సీసీ రోడ్డు వేస్తున్నట్లు తెలిపారు. ఇంకా అవసరమైన ప్రాంతాల్లో ఎంపీ తోపాటు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సహకారంతో సీసీ రోడ్లు వేస్తామని తెలిపారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ దండు జగన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు షఫీ, నాయకులు ఉదయ్, ఆనంద్, షాకీర్, సునీల్‌రెడ్డి, నాగభూషణం, కాలనీ చిన్న, నరేష్, షబ్బీర్, సాయి పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణపనులు ప్రారంభిస్తున్న నాయకులు

వచ్చే ఏడాది మెడికల్ కళాశాల తరగతులు

మదనపల్లె : మదనపల్లె మెడికల్ కళాశాలను వచ్చే విద్యాసంవత్సరంలో ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు డైరెక్టర్, మెడికల్ ఎడ్యుకేషన్ నోడల్ అధికారి డాక్టర్ సుగుణన్ తెలిపారు. శుక్రవారం మెడికల్ కాలేజ్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ మురళీధర్‌తో కలిసి జిల్లా ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించారు. ఆస్పత్రిలో ఉన్న సౌకర్యాలను పరిశీలించారు. ఆస్పత్రిలో అందుబాటులో ఉన్న సిబ్బంది సంఖ్య, అవసరమైన సిబ్బంది వివరాలను మెడికల్ ఆఫీసర్‌ను అడిగి తెలుసుకున్నారు. తనిఖీ వివరాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. మెడికల్ కళాశాలకు అవసరమైన సౌకర్యాలు, సిబ్బంది నియామకానికి చర్యలు చేపట్టేందుకు వీలుగా నివేదికలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ పద్మాంజలిదేవి, ఆర్ఎంఓ ప్రసాదరాజు, మెడికల్ కాలేజి అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్లు, నర్సింగ్ సూపరింటెండెంట్ నాగశ్రీ పాల్గొన్నారు.



సూపరింటెండెంట్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న డీఎంఈ నోడల్ అధికారి

మానవ అక్రమ రవాణా నివారణపై ర్యాలీ

వాల్మీకిపురం: మానవ అక్రమ రవాణాను నిషేధించాలని పట్టణంలోని పీవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో కలసి కళాశాల నుంచి గాంధీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, మానవహారం ఏర్పాటు చేశారు. శుక్రవారం గ్రామ జ్యోతి సొసైటీ సూచనల మేరకు ఆల్ పీపుల్ స్టూడెంట్ యూనిట్ ఫోర్స్ సంస్థ ఆధ్వర్యంలో వాక్ ఫార్ ఫ్రీడం అనే నినాదంతో మానవ అక్రమ రవాణాకి గురైన బాధితులకు మద్దతుగా అక్రమ రవాణాని నిషేధించాలని కోరుతూ శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు.



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు